## ఏపీ లో కేంద్ర బృందం పర్యటన

అమరావతి కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలోని బృందం గురువారం నాడు వరద ప్రభావిత జిల్లాల్లో పర్యటించాడానికి వచ్చింది. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో సంభవించిన నష్టాన్ని అంచనా వేయనుంది. నేరుగా నష్టాన్ని పరిశీలించడంతో పాటు వరద బాధితులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకోనుంది. ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షించింది. భారీ వర్షాలు, వరదల వల్ల సంభవించిన పరిస్థితులను కేంద్ర బృందానికి అధికారులువివరించారు.


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శుక్రవారం 06-09-2024   సంపుటి : 06   సంచిక : 348   పేజీలు : 8   వెల : రూ 3-00


# పదేండ్లలో 32 రెట్లు పెరిగిన సౌరశక్తి సామర్థ్యం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ సెప్టెంబర్ 5, : తొలి అంతర్జాతీయ సోలార్ ఫెస్టివల్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచమంతా ఈరోజు సూర్యుడి ప్రభావాన్ని మననం చేసుకుంటూ మెరుగైన భూమండలం కోసం ప్రతిఒక్కరినీ ఈరోజు ప్రేరేపిస్తుందని ప్రధాని ఆకాంక్షించారు. గత పదేండ్లలో దేశం గ్రీన్ ఎనర్జీలో ఎంతో పురోగతి సాధించిందని గుర్తుచేశారు. పదేండ్లలో దేశ సౌరశక్తి సామర్థ్యం 32 రెట్లు పెరిగిందని చెప్పారు. వేగం, విస్తృతితో భారత్ 2030 నాటికి 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ సామర్థ్యాన్ని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదాల్లో నిక్షిప్తమైన మంత్రాల్లో అత్యంత ప్రముఖమైనవి సూర్యుడి గురించి ప్రస్తుతించినవి ఉన్నాయని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. కోట్లాది మంది భారతీయులు ఈ మంత్రాన్ని పఠిస్తారని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంస్కృతులు సూర్యుడిని వారి వారి పద్ధతుల్లో గౌరవిస్తాయని చెప్పారు. పునరుత్పాదన ఇంధనలో ప్యారిస్ ఆశయాలను సాధించిన తొలి జీ20 దేశం భారత్ అని తెలిపారు. సౌర శక్తి రంగంలో తిరుగులేని వృద్ధితోనే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. సౌరశక్తిని ప్రోత్సహించేందుకు తాము కొద్దినెలల కిందట ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిల్ యోజనను ప్రారంభించామని తెలిపారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 75000 కోట్లు వెచ్చిస్తోందని చెప్పారు. ఈ పథకంలో భాగంగా కోటి మంది గృహస్థులు తమ ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లను అమర్చుకునేందుకు ఊతమిస్తామని తెలిపారు.

# మరోమారు రంగంలోకి దిగిన బాబు



ఏలూరు, బుడమేరు కాల్వల పరిశీలన



విజయవాడ,సెప్టెంబర్5: నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు మరోసారి పర్యటించారు. ఎనికేపాడు వద్ద ఏలూరు కాల్వ, బుడమేరు ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బల్లకట్టుపై బుడమేరు దాటి ముంపు ప్రాంతాల్లో సీఎం పర్యటించారు. గండ్లు పడిన ప్రాంతాల్లో పనులపై అధికారులతో ఆయన చర్చించారు. దెబ్బతిన్న పంటల వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా... భారీ వర్షాలు, వరదలతో ఏపీలో పరిస్థితి దారుణంగా ఉంది. విజయవాడలో అనేక ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యారు. ముంపుకు గురైన ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వివిధ రకాలుగా వరద బాధితులు ఆహారం, మంచి నీరు, మందులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పడవలు, హెలీకాప్టర్లు, డ్రోన్ల సాయంతో కాలనీల్లో బాధితులకు భోజనాన్ని సరఫరా చేస్తున్నారు. మరోవైపు బుడమేరు వరద నుంచి ఇప్పుడిప్పుడు బెజవాడ వాసులు కాస్త కోలుకుంటున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో బాధితులు ముంపు ప్రాంతాల్లో భారీ ఎత్తున సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. నిన్న ఉదయానికి నాటికి రెండు నుంచి మూడు అడుగుల మేర సింగ్‌నగర్ దూర ప్రాంతాల్లో వరద మట్టం తగ్గింది. దీంతో గత మూడు రోజులుగా బిక్కుబిక్కుమంటూ గడిపిన వరద బాధితులు బయటకు వచ్చేశారు. సింగ్‌నగర్ నుంచి దూరప్రాంతాలైన కండ్రిక, ఆంధ్రప్రభ కాలనీ, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, రాధానగర్, డాబాకొట్లు సెంటర్, ఇందిరానాయక్ నగర్, పైపులరోడ్డు, తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా వరద బాధితులు సురక్షిత ప్రాంతాలకు పోటెత్తారు. కాగా... బాధితుల తరలింపు తక్కువగా ఉండటం వల్ల అగ్నిమాపక శకటాలు తమ పనులు నిర్వహించలేకపోయాయి. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకుల పంపిన ట్రాక్టర్లు బాధితుల రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వరద నుంచి వచ్చే బాధితులు దాదాపుగా నాలుగు నుంచి పది కిలో మీటర్ల మేర నడుచుకుని రావటంతో వారికి స్వాంతన కలిగించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆటోలు, లారీలు, మినీవ్యాన్‌లు, ట్రాక్టర్ల వంటివి పెద్ద సంఖ్యలో నడిపాయి. పైపులరోడ్డు, గొల్లపూడి, తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది.

# చంద్రబాబు పనితీరు ఆదర్శం

**ప్రజలను కష్టం నుంచి గట్టెక్కించేందుకు నిర్విరామ కృషి**
**ప్రశంసల్లో ముంచెత్తిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

అమరావతి,సెప్టెంబర్5:ఏపీప్రస్తుతమున్న విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిద్రాహారాలు మాని మరీ శ్రమించారు. ప్రజలను కష్టం నుంచి గట్టెక్కించేందుకు నిర్విరామంగా పని చేశారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబును డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్ ప్రశంసల్లో ముంచెత్తారు. పనితనం ఆదర్శమంటూ ఆకాశానికెత్తారు. చంద్రబాబు నాయకత్వం, పాలనలో అవిశ్రాంత కృషి నిజంగా స్ఫూర్తిదాయకమని.. ప్రశంసనీయమని కొనియాడారు. అధికార సంక్షోభం, వ్యవస్థల నిర్వీర్యం, వనరుల దోపిడీ వారసత్వంగా గత ప్రభుత్వం నుంచి వచ్చిందన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మరోవైపు ప్రకృతి వైపరీత్యం, వీటి నడుమ మీ పాలనా దక్షత, విధి నిర్వహణలో మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం, అభినందనీయమని చంద్రబాబుని పవన్ కల్యాణ్ కొనియాడారు. 'గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారూ, మీ ప్రోత్సాహకరమైన మాటలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. గత వైసీపీ ప్రభుత్వం పరిపాలనా సంక్షోభం, సంస్థాగత క్షీణత, వనరుల దోపిడీ వారసత్వాన్ని మిగిల్చింది. ఈ సవాలుతో కూడిన పరిస్థితుల



మధ్య.. ఇప్పుడు అపూర్వమైన ప్రకృతి వైపరీత్యాల మధ్య, మీ నాయకత్వం, పాలనలో అవిశ్రాంత కృషి నిజంగా స్ఫూర్తిదాయకం, ప్రశంసనీయం. అటువంటి సమయాల్లో మన ప్రజలను ఆదుకోవడం నుంచి మనం త్వరలోనే బయటపడతామని నేను ఆశిస్తున్నాను' అని పవన్ పేర్కొన్నారు.మీ మాటలతో మరింత ఉత్తేజాన్ని కలిగించినందుకు చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. గత ప్రభుత్వం నుంచి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మరోవైపు ప్రకృతి వైపరీత్యం, వీటి నడుమ మీ పాలనా దక్షత, విధి నిర్వహణలో మీరు కష్టపడే విధానం స్ఫూర్తిదాయకం, అభినందనీయం.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

## ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు : వాతావరణశాఖ

అమరావతి : పశ్చిమ, వాయువ్య బంగాళాఖా తంలోమరో అల్పపీడనం ఏర్పడింది. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండడంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతాయని వాతావరణశాఖ మరోసారి హెచ్చరించింది. రాగల 24 గంటల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది అల్లూరి, పార్వతీపురం, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ ఎలెర్ట్‌ను జారీ చేసింది. తీరం వెంబడి 30-40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. నాలుగు రోజుల పాటు వర్షాలు ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాలో చాలా చోట్ల, మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. గడిచిన చోడవరం 11 సెం.మీ, గుడివాడలో మచిలిపట్నంలో 7 సెంమీ వర్షపాతం నమోదయ్యింది



# దీక్ష ,రావూస్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..

**- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత పాఠాలు స్ఫూర్తిదాయకం..**


ఫోటో రైటప్ : ఎమ్మిగనూరు సెప్టెంబర్ 5 విభారె న్యూస్..పట్టణంలోని దీక్ష జూనియర్ మరియు రావూస్ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దీక్షజూనియర్, రావూస్ కళాశాల సీఈవో తిరుమలరెడ్డి అధ్యక్షతన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సిఈఓ తిరుమల రెడ్డి తో పాటు రావూస్ కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్ దీక్ష జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి తదితర అధ్యాపక బృందం నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఈఓ తిరుమలరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తన జీవిత గమనంలో అనేక పోరాటాలు, అలజడులు, మరెన్నో ఎదుర్కొని భారతదేశంలోని ప్రతి ఉపాధ్యాయుడికి మార్గదర్శిగా నిలిచారనికళాశాలఅధ్యాపకులకువిద్యార్థినీ,విద్యార్థులకు గుర్తుచేశారు. అంతేగాక ఈ ప్రపంచంలో గురువే సమస్తం,ఏరంగంలో రాణించిన వారైనా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకున్న వారైనా ఒక గురు వద్ద పాఠాలు నేర్చుకున్న వారే. గురువు అందించిన విజ్ఞాన ప్రోత్సాహ స్ఫూర్తితో ఉన్నత స్థానాలను అధిరోహించిన వారు మన దేశంలో ఎందరో కలరు. అంతేగాక మెరుగైన సమాజాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించేది గురువులే. అలాగే గురువులు పాఠాలు,గుణపాఠాలు, జీవిత పాఠాలు బోధిస్తారు. ఆటలు పాటలతో పాటు పోరాటాలు చేయడం నేర్పిస్తారు, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్నిస్తారు, ప్రతిభను గుర్తించి శిక్షణ ఇస్తారు, తప్పు చేస్తే శిక్షిస్తారు, విద్యార్థులు అనుకున్నది సాధించేలా ప్రోత్సహిస్తారు కావున అటువంటి



నివాళులర్పిస్తున్న రావుస్ డిగ్రీ, దీక్ష జూనియర్ కాలేజ్ యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులు..

గురువులను గౌరవిస్తూ తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోమని విద్యార్థులకు గుర్తు చేశారు. తరువాత రావూస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే టార్చర్ కాదని విద్యార్థుల జీవితాలకు టార్చ్ బేరర్స్ అని, తాము కొవ్వొత్తి లాగా కరిగిపోతూ విద్యార్థుల జ్ఞానానికి వెలుగునిచ్చేవారు ఉపాధ్యాయులని విద్యార్థులకు తెలిపారు. దీక్ష జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజంలో మంచి ప్రవర్తన,క్రమశిక్షణ, వినయ విధేయతలతో గురువులను గౌరవిస్తూ విద్యను అభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావూస్ కళాశాల అధ్యాపకులు గోరంట్ల, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నూరు భాష, విజయ్ కుమార్, పాల్ రాజ్, వీరేష్, నందిని, అన్నపూర్ణ, విజయరాజ్ , మనో వెంకట్, సంధ్య, శృతి ప్రియా, సంపత్, ధనుంజయ, గోవిందు అలాగే దీక్ష జూనియర్ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ పవన్ కుమార్ తో పాటు శివకుమార్, రామాంజనేయులు, సురేష్, శివ, పి.శివకుమార్, గౌస్, కృష్ణ, వి.శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, కె. నాగేంద్రరావు, గోపాలకృష్ణ, నూరిల్ల, అహ్మద్ అలీ, లలిత, రమాదేవి, భాగ్యలక్ష్మి, విమల, బేగం, సింధు, రేణుకలతోపాటు దీక్ష, రావూస్ విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ :: ఆవుల విజయభాస్కర్ రెడ్డి.



ఆళ్లగడ్డ ::విభారె న్యూస్ :: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పండుగ శుభ సందర్భంగా ఈ నెల 6వ తేదీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు ఆళ్లగడ్డ పట్టణం టి.బి. రోడ్డు లోని ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, ఆవుల లతారెడ్డి తెలిపారు. భారతీయులు జరుపుకునే అతి ముఖ్యమైన హిందూ పండుగ వినాయక చవితి. పార్వతీ పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టినరోజు మనం వినాయక చవితి గా జరుపుకుంటామని ఆయన తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే అనేక రసాయనాలు కలిపి తయారుచేసిన విగ్రహాల వలన పర్యావరణం దెబ్బతింటుందని, రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పిల్లలకు విద్యార్థి దశ నుండే పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రసాయనాలు వాడిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం వలన వాతావరణ కాలుష్యం మరియు జల కాలుష్యం ఏర్పడుతోందని దీని వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆయన తెలిపారు. పూర్వం అందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించే వారు. కనుక సర్వసిద్ధంగా ప్రకృతి మనకు ఇచ్చిన మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకునేవారు. ప్రజల్లో కూడా పర్యావరణ పరిరక్షణ పై అవగాహన పెరిగిందని, ప్రతి ఏటా మట్టి వినాయక విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ అందుకు నిదర్శనం అని ఆయన తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పూజించి ఆ విఘ్నేశ్వరుని కృపకు పాత్రులు కావాలని అయన ఆకాంక్షించారు.

# సంపాదకీయం

శుక్రవారం 06-09-2024

## బుల్డోజర్ పాలిటిక్స్......

బుల్డోజర్ పేరు మీరు చాలాసార్లు విని ఉంటారు. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించినప్పుడల్లా బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బుల్డోజర్ ఒక శక్తివంతమైన యంత్రం. ఇది అందరికీ తెలుసు. బుల్డోజర్ 90ల పిల్లలకు కూడా ఇష్టమైన వాహనం. ఇది తవ్వకాలకు, చెత్తను తొలగించడానికి, ఆక్రమణలను తొలగించడానికి ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో బుల్డోజర్ అనే పదం బాగా ప్రాచుర్యం పొందింది. అయితే దీని అసలు పేరు మీకు తెలుసా? బుల్డోజర్ గురించి చాలా మందికి తెలియని విషయాలు ఇక్కడ తెలుసుకుందాం..ప్రస్తుతం తెలంగాణలో ఈ బుల్డోజర్ ఫీవర్ కొనసాగుతోంది. బుల్డోజర్ చర్యకు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తోంది. దీని తదుపరి విచారణ సెప్టెంబర్ 17, 2024న జరగనుంది. అయితే, ఈ బుల్డోజర్ వాహనం అసలు పేరు ఇది కాదని మీకు తెలుసా? ఇతర వాహనాలతో పోలిస్తే దీని మైలేజీని కూడా భిన్నంగా కొలుస్తారు.భారతదేశంలో అత్యధికంగా బుల్డోజర్లను విక్రయించే కంపెనీ జేసీబీ. కానీ చాలామంది బుల్‌డోజర్ అంటే జేసీబీ అని అర్థం చేసుకుంటారు. పసుపు రంగు బుల్డోజర్‌పై నలుపు రంగులో జేసీబీ బ్రాండ్ పేరు రాయడం సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది.. ఇది కాకుండా ఇతర కంపెనీలు కూడా బుల్డోజర్లను విక్రయిస్తాయి. మార్కెట్లో అనేక రకాల బుల్డోజర్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కెపాసిటీ, మైలేజీ, ధర మొదలైన వాటిలో తేడా ఉంటుంది. బుల్డోజర్ అసలు పేరు బ్యాక్‌హో లోడర్. బుల్డోజర్ లేదా బ్యాక్‌హో లోడర్ కోసం 'మైలేజ్' అనే పదాన్ని కొద్దిగా భిన్నంగా ఉపయోగిస్తారు. దేశంలో వివిధ రకాల బుల్డోజర్ యంత్రాలు పనిచేస్తాయి.మెషీన్‌లు వివిధ మోడల్‌లలో వస్తాయి.కార్లు లేదా బైక్‌ల మాదిరిగా కాకుండా వాటి మైలేజీని లీటర్‌కి కిలోమీటర్లలో లెక్కించరు. బదులుగా, బుల్డోజర్ ఒక గంటలో ఉపయోగించే డీజిల్ మొత్తాన్ని కొలుస్తారు. బుల్‌డోజర్‌కి మైలేజ్ ఎంత అనేది అది గంటసేపు నడిచినప్పుడు ఉపయోగించే డీజిల్ మొత్తాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. బుల్‌డోజర్ జస్టిస్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిందితుడు అయినంత మాత్రాన ఇల్లు కూల్చివేయాలా అని కేంద్రాన్ని ప్రశ్నించింది. బుల్‌డోజర్ న్యాయాన్ని నిలదీస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పిటిషనర్ తరఫున సీనియర్ అడ్వకేట్ దుశ్యంత్ దావే వాదించారు. దేశవ్యాప్తంగా ఈ బుల్‌డోజర్ న్యాయాన్ని అమలు చేయాలని చూస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ న్యాయాన్ని తప్పుబట్టింది. నేరం చేసినంత మాత్రాన ఆ వ్యక్తి ఆస్తుల్ని ధ్వంసం చేయడం సరికాదని తేల్చి చెప్పింది. ఆ ఇంటి నిర్మాణం అక్రమం అని తేలినప్పుడే ధ్వంసం చేయాలని స్పష్టం చేసింది. దీనిపై కచ్చితంగా కొన్ని మార్గదర్శకాలు జారీ చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలు అని తేలినప్పుడు ముందు నోటీసులు ఇవ్వాలని, వాళ్లు స్పందించని పరిస్థితుల్లో చట్టానికి లోబడి ధ్వంసం చేయాలని తేల్చి చెప్పింది. "ఇళ్లు కూల్చివేయాలంటే అంత కన్నా ముందు కచ్చితంగా కొన్ని మార్గదర్శకాలు పాటించాలి. కేవలం ఓ నేరం చేసినంత మాత్రాన ఇల్లు కూల్చేస్తారా. ఒకవేళ అది అక్రమ నిర్మాణం అని తేలితే పరవాలేదు. కానీ కేవలం నిందితుడు అన్న కారణానికి ఇల్లు కూల్చివేస్తామనడం మాత్రం సరికాదు. ఈ విషయంలో కచ్చితంగా ఓ విధానాన్ని అనుసరించాలి. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘిస్తేనే కూల్చివేస్తున్నామని మీరు చెబుతున్నారు. అయితే...అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తప్పకుండా ఉండాలి"– సుప్రీంకోర్టు ధర్మాసనం . పిటీషనర్ల తరపున అడ్వకేట్ దుశ్యంత్ దావే, సీయూ సింగ్ కోర్టులో తమ వాదనలు వినిపించారు. ఢిల్లీలోని జహంగీర్‌పురిలో చేపట్టిన కూల్చివేతల గురించి ప్రస్తావించారు. 50,60 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లనూ కూల్చివేస్తున్నారని చెప్పారు. కొన్ని కేసులనూ ఈ సందర్భంగా ఉటంకించారు. ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఓ ఘటన జరిగింది. ఓ విద్యార్థి తోటి విద్యార్థిని కత్తితో పొడిచాడు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వెంటనే అధికారులు ఆ నిందితుడి ఇల్లు కూల్చి వేశారు. దీనిపైనే అడ్వకేట్స్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "కొడుకు తప్పు చేస్తే తండ్రి కట్టుకున్న ఇల్లుని కూల్చివేయడమేంటి" అని ప్రశ్నించారు. ఇది సరికాదని స్పష్టం చేశారు. నేరస్థులు అని నిర్ధరణ అయినప్పటికీ ఇళ్లు కూల్చివేసే హక్కు లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ బుల్‌డోజర్ జస్టిస్‌పై ఎన్నో వివాదాలు కొనసాగుతున్నాయి. ఇదేం న్యాయం అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్దతునిచ్చే వాళ్లు ఉన్నప్పటికీ అదే స్థాయిలో వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. మరో వైపుమాజ్ వాదీ పార్టీ 2017లో అధికారంలోకి వస్తే అన్ని బుల్డోజర్లను గోరఖ్‌పూర్ వైపు నడిపిస్తామని అఖిలేష్ యాదవ్ మంగళవారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ కావడంతో ఈ వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. అఖిలేష్ హెచ్చరికలను యోగి ఆదిత్యనాథ్ బుధవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో తిప్పికొట్టారు. బుల్డోజర్ నడపడానికి ధైర్యం, తెలివితేటలు, దృఢ సంకల్పం ఉండాలని, ఆ లక్షణాలేవీ యాదవ్‌లో లేవని అన్నారు. "అందరి చేతులు బుల్డోజర్ నడపడానికి పనికి రావు. దానికి ధైర్యం, తెలివితేటలు (దిల్, దిమాగ్) ఉండాలి. సమర్థత, దృఢ సంకల్పం ఉన్నవాళ్లే బుల్డోజర్ నడపగలరు. అల్లర్లు సృష్టించేవారి ముందు మోకరిల్లేవారు బుల్డోజర్ ముందు నిలవలేరు" అని కౌంటర్ ఇచ్చారు.అఖిలేష్ యాదవ్‌ను 'టిప్పు' అనే నిక్‌నేమ్‌తో యోగి సంబోధిస్తూ, టిప్పు ఇప్పుడు సుల్తాన్ కావాలని ప్రయత్నిస్తున్నారంటూ చురకలు వేశారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు యూపీలో 'ఆటవికపాలన' ఉండేదన్నారు. అఖిలేష్ యాదవ్, ఆయన అంకుల్ శివపాల్ యాదవ్‌లు బలవంతపు వసూళ్లు చేసేవారని, ఏరియాలు పంచుకుని మనీ లూటీలకు పోటీ పడేవారని ఎద్దేవా చేశారు.

## ఆదోని మెడికల్ కాలేజ్ పనులను నిలిపివేయాలని ఇచ్చిన ప్రభుత్వ మేమోను వెంటనే ఉపసంహరించుకోవాలి..- సిపిఎం, ప్రజా సంఘాలు




నిరసన తెలియజేస్తున్న సిపిఎం ప్రజా సంఘాల నాయకులు..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 5 విభారె న్యూస్..ఆదోని మెడికల్ కాలేజ్ పనులు నిలిపివేయాలని కోరుతూ సంబంధిత డిపార్ట్మెంట్ నుండి మెమోలను ప్రభుత్వం ఇవ్వడాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ప్రజా సంఘాలు సిఐటియు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.గోవిందు, సిఐటియు నాయకులు రాముడు, రైతు సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య,అబ్దుల్లా, డివైఎఫ్ఐ నాయకులు సురేష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోపశ్చిమ ప్రాంతం అన్ని విధాల విద్య, వైద్యంలో పూర్తిగా వెనుకబడి ఉన్న ప్రాంతమని,నిత్యం కరువు కాటకాలను ప్రజలు ఎదుర్కొంటున్నారని,ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణం పశ్చిమ ప్రాంత ప్రజలకు ఆనందం కలిగించిందని తెలిపారు. అయితే ఈ పనులను ఆపాలని కోరుతూ ఏపీ ఎం ఎస్ ఐ డిసి చీఫ్ ఇంజనీర్ ఆగస్టు 30న ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణం పనులు ఆపివేయాలని ఆదేశాలు ఇచ్చారు. పై ఆదేశాల మేరకు ఏపీ ఎం ఎస్ ఐ డి సి సూపర్డెంట్ ఇంజనీర్ కర్నూల్ వార జి ఎం ఎస్ / 2024-25/158 సెప్టెంబర్ 3 తేదీన సంబంధిత మెడికల్ కాలేజీ కాంట్రాక్టర్లకు పనిని నిలుపుదల చేయవలసిందిగా మేమొ ఇచ్చారు. ఈ విషయం తెలిసిన పశ్చిమ ప్రాంత ప్రజలకు నిరాశ మిగిలిందని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆదోని మెడికల్ కాలేజీ పూర్తి అయితే వెనుకబడిన పశ్చిమ ప్రాంతాలు ఎమ్మిగనూరు మంత్రాలయం ఆదోని ఆలూరు పత్తికొండ ప్రజలకు అన్ని విధాల మేలు చేస్తారని ఆశించారు. అయితే పనులను ఆపివేయమని ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆదేశాలు ప్రజలను నిరాశపరచడమే కాక రాబోవు కాలంలో కాలేజీ నిర్మాణం పనులు ఆపితే అన్ని వర్గాల ప్రజలు ఆందోళన మార్గాలు చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అందువల్ల కొత్తగా వచ్చిన ఎన్ డి ఏ ప్రభుత్వం వెంటనే పనులు ఆపివేయాలనేటువంటి మెమోను ఉపసంహరించుకోవాలని చెప్పి సిపిఎం పార్టీ ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఈ సందర్భంగా ప్రభుత్వమేమోనో ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానిక డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల కార్యకర్తలుకృష్ణ,రాఘవరెడ్డిపాల్గొన్నారు.

## వరద భాదితులకు రూ. 5 లక్షలు సహాయం ప్రకటించిన ఎమ్మెల్యే బీవీ..




.ఐదు లక్షల విరాళాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే బివి..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 5 విభారె న్యూస్..విజయవాడ ప్రాంతంలో ఇటీవల విస్తరంగా కురిసిన భారీ వర్షాలు కారణంగా ఇళ్లల్లోకి వరద నీరుచేరి చాలా ఇబ్బందులు పడుతున్నారని తమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఐదు లక్షల ఆర్థిక సాయం ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితులకు నేనున్నానని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా కల్పిస్తూ ఉదయం రాత్రి తేడా లేకుండా వారికి ఎన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ డ్రోన్ల ద్వారా భోజనాలకు కల్పిస్తూ ఇతర సహాయక చర్యలు చేపడుతున్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికై మూడు నెలలు అవుతుందని,వరద బాధితులకుతన వంతు 3 నెలల జీతాన్ని రూ. 5లక్షలుచెక్కును అందిస్తున్నట్లు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ తెలిపారు.అలాగే నందవరం మండలం టిడిపి నాయకులు ఈరన్న గౌడ్ కుడా రూ. 10 వేల చెక్ ను అందించినట్లు తెలిపారు. టౌన్ బ్యాంకులో అవినీతి జరిగినట్లు బహిరంగ ప్రకటన చేస్తున్నారని ప్రశ్నించగా దానిపై కమిటీ నియమకం తర్వాత విచారణ చేపడతామన్నారు. అలాగే ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని దీనిపై ఈ ప్రాంతం వారు నష్టపోతారని ప్రశ్నించగా తమకు తెలియదని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కి సంప్రదించి నిర్మాణాన్ని కొనసాగించేటట్లు చూస్తామన్నారు.టౌన్ బ్యాంకు నూతన కమిటీ ప్రతిపాదన :- ఎమ్మిగనూరు టౌన్ బ్యాంక్ నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యుల కమిటీని ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత శాఖ మంత్రికి ప్రతిపాదన చేసినట్లు ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. నూతన అధ్యక్షులుగా ఉరుకుందయ్య శెట్టి, ఉపాధ్యక్షులుగా బండ నరసప్ప, సభ్యులుగా మేతర్ మెహబూబ్ భాష, ఉప్పర రవికుమార్, దోమ భీమేష్, వాల్మీకి రాజు, వెంకటేశ్వర్ రెడ్డి, కదిరిగుట శాలెం, తోట నరసింహులు,అడిమి నవీన్ కుమార్, మాచాని బల గంగాధర్లను పేర్లను ప్రతిపాదన పంపినట్లు తెలిపారు.

## విజయవాడ నగర ప్రాంతాల్లో కేంద్రమంత్రి ఏరియల్ సర్వే

అమరావతి : ఏపీలో భారీ వర్షాలు, వరదల కారణంగా అతలకుతలమైన విజయవాడ నగరాన్ని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ గురువారం ఏరియల్ సర్వే నిర్వహించారు. బూడమేరకు గండ్లుపడిన ప్రాంతాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో కలిసి పరిశీలించారు. ఇతర ముంపు ప్రాంతాలనూ కేంద్ర మంత్రి పరిశీలించారు.మరో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలో జరిగిన వరద ప్రాంతాల్లో పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడి ప్రభుత్వం ఆదుకుంటామని మాట్లాడారు. గత వైసీపీ పాలనలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల బాగోగుల గురించి పట్టించుకోకపోవడం వల్లే ప్రకృతి వైపరిత్యాలు వచ్చాయని ఆరోపించారు.ఇటువంటి విపత్తు మళ్లీ రాకుండా ప్రతి సంవత్సరం సమీక్షలు నిర్వహించి పకడ్బందీగా నీటివనరులను కాపాడుతామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు నష్టపరిహారం అందిస్తామని స్పష్టం చేశారు.



## టౌన్ బ్యాంకు చైర్మన్ గా ఎంపికైన ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టికి శుభాకాంక్షలు తెలిపిన ఆది ప్రవీణ్, తులసి సత్యనారాయణలు..



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 05 విభారె న్యూస్..స్థానిక కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ గా 2వసారి ఎంపికైన అవోప గౌరవ అధ్యక్షులు ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టికి అవోపా చీఫ్ కన్వీనర్ తులసి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఆది ప్రవీణ్ లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరంవారు మాటాడు తూ అమ్మవారి దయతో భవిష్యత్తులో ఉరుకుందయ్య శెట్టి మరింత ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసిన నాగరాజు...



విభారేన్యూస్‌డోన్‌మా ప్రతినిధి:-సెప్టెంబర్ 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సావిత్రిబాయి పూలే కాశ్య విగ్రహమునకు నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు పూలమాలవేసి విద్యార్థులకు సావిత్రిబాయి పూలే జీవిత విషయాలను తెలియజేస్తూ భారతదేశానికి మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఈమె చిన్నతనంలోనే దళిత బడుగు బలహీన వర్గాల మహిళలకు విద్యను అందించారు అగ్రకుల నాయకులు ఆయన చేస్తున్న సామాజిక సేవలకు ఎన్నో ఆటంకాలు కల్పించారు అయినా కూడా దళిత బడుగు బలహీన వర్గాల మహిళలకు దేశంలో మొట్టమొదటిసారి విద్యను అందించినవారు సావిత్రిబాయి పూలే అని తెలియజేశారు అదేవిధంగా నంద్యాల జిల్లాకి ఆదర్శంగా డోన్ పాతపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలనందుఅసిస్టెంట్ హెడ్మాస్టర్ శ్రీ వెంకట సుబ్బారెడ్డి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు సహకరించిన మొదటి వ్యక్తి అంతేకాకుండా జిల్లాకి ఆదర్శంగా విద్యార్థులను తీర్చిదిద్దరుములో ఆయన ఎంతో గొప్పవారు మహనీయుల జయంతిలో వర్ధంతిలు సామాజిక సేవకుల జయంతులు స్వతంత్ర సమరయోధుల జయంతులు యుద్ధవీరుల జయంతులు ఎంతోమంది మహనీయులు జీవిత చరిత్రలను విద్యార్థులకు నేర్పించారు అదేవిధంగా తన పాఠశాల నుండి ఇంజనీరింగ్ విద్యను వైద్య విద్యను చాలా మంది విద్యార్థులను చైతన్యపరిచి ఇంజనీర్లుగా డాక్టర్లుగా తయారు చేశారు అని ఆయన అన్నారు

## ప్రతాప్ ఉరుకుందయ్యకు శుభాకాంక్షలు తెలిపిన కే.యం. నాగేంద్ర కుమార్..



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 5 విభారె న్యూస్..ఎమ్మిగనూరు టౌన్ చరిత్రలో మాచాని శివన్న తర్వాత రెండో సారి టౌన్ బ్యాంక్ చైర్మన్ గా ఎన్నికైన ఏకైక వ్యక్తి ఆర్యవైశ్య ముద్దు బిడ్డ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టికి కే.ఎం.నాగేంద్ర కుమార్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వాసవీ మాత దివ్య మంగళ ఆశీస్సులు ఆయన పై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు..

## టౌన్ బ్యాంక్ చైర్మన్ గా ఎన్నికైన ప్రతాప్ ఉరుకుందయ్యకు శుభాకాంక్షలు తెలిపిన గ్రంథె గిరి..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 5 విభారె న్యూస్..నాడు 25.05.2016 అనగా బుధవారం నాడు మొట్ట మొదటిసారిగా ఎమ్మెల్యే టౌన్ బ్యాంక్ చైర్మన్ గా ఆయన పేరు ప్రకటించిన తేదీ.. నేడు 05.092024 అనగా గురువారం నాడు, నేడు ఉదయం 10.30 గం ఇదే సమయానికి ప్రకటించడం విశేషం. ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి కి హృదయపూర్వక శుభాకాంక్షలు గ్రంథె గిరి తెలియజేశారు..



# మళ్లీ బుడమేరు టెన్షన్

విజయవాడ, సెప్టెంబర్5, బుడమేరులో మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. పలుచోట్ల గండ్లు పడటంతో అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమైంది.యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో? మంత్రి లోకేశ్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు..బుడమేరులో వరద ఉధృతి పెరగటంతో విజయవాడ నగరంలోని ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ జక్కంపూడి, సింగ్ నగర్ ప్రాంతాలకు వరద నీరు చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. శాంతినగర్ గండిని పూడ్చే పనులు ముమ్మరమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో బుడమేరు గండి పూడ్చే పనులను మంత్రి నిమ్మల రామానాయుడు కలిసి లోకేశ్ పరిశీలించారు. అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేసి మొదటి గండి పూడ్చారు. గత ఐదేళ్లలో కనీస మరమ్మత్తుల పనులు కూడా చెయ్యకపోవడమే గండ్లు పడటానికి ప్రధాన కారణమని అధికారులు వివరించారు. వీలైనంత త్వరగా గండ్లు పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష చేశారు.ఆ తర్వాత బుడమేరు గండి పూడ్చే పనులను డ్రోన్ లైవ్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి లోకేశ్ పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న మంత్రి నిమ్మల రామానాయుడుతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతమయ్యేలా చూస్తున్నారు. ప్రధానంగా 2,3 వంతెనల వద్ద పడిన గండ్ల నుంచే వరద నీరు అజిత్ సింగ్ నగర్లోకి ప్రవేశిస్తోంది.ఈ నేపథ్యంలో వీటిని పూడ్చి వేయడమే లక్ష్యంగా మొత్తం యంత్రాంగం అంతా పనిచేస్తోందని మంత్రి లోకేశ్ తెలిపావిజయవాడకు బుడమేరు చాలా సమస్యగా తయారైందన్నారు సీఎం చంద్రబాబు. చిన్న చిన్న వాగులన్నీ కలిసి బుడమేరు పెద్దదిగా మారిందని చెప్పారు. "బుడమేరును గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అటు కృష్ణానది, ఇటు బుడమేరు రెండూ కలిసి విజయవాడను ముంచెత్తాయి. గత ఐదేళ్లపాటు ఏం చేశారని వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్నాం. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణం. ఆక్రమణకి పోలవరం కాలువలోనూ మట్టి తవ్వేశారు. ఇంత చేసి, ఇప్పుడు ఎదురు దాడి చేస్తున్నారు. బుడమేరు నీరు కొల్లేరు, కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. బుడమేరు ప్రవాహ దారిలో కాలువలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తాం. ఇలాంటి విపత్తులను అందరూ సమిష్టిగా ఎదుర్కోవాలి. వరద బాధితులు అందరికీ న్యాయం చేస్తాం" అని స్పష్టం చేశారు.ప్రైవేటు బోట్లు వాళ్ళు డబ్బులు వసూలు చేస్తే కేసులు పెడతామని చంద్రబాబు హెచ్చరించారు. అరెస్ట్ లు కూడా చేపిస్తామన్నారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు అధిక ధరకి అమ్మితే, కఠిన చర్యలు ఉంటాయన్నారు. రేపటి నుంచి ప్రభుత్వమే తక్కువ రేటుకి కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

# పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి ఎదురుగాలి

ఏలూరు, సెప్టెంబర్ 5, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి ఎదురుగాలి వీస్తోంది. ఇప్పటికే ఏలూరు కార్పొరేషన్‌ను కోల్పోయిన వైసీపీ.. ఇప్పుడు జడ్పీ పీఠాన్ని చేజార్చుకునేలా కనిపిస్తోందంటున్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన జడ్పీ సమావేశంలో వైసీపీ జడ్పీటీసీల తీరును గమనిస్తే? మెజార్టీ సభ్యులు కూటమిలో చేరేందుకు సిద్ధమనే సంకేతాలు పంపినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. జడ్పీ చైర్ పర్సన్ గంట పద్మశ్రీతో సహా దాదాపు 20 మంది జడ్పీటీసీలు నేడోరేపో? కూటమితో జట్టు కట్టేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జిల్లాలో వైసీపీ వ్యవహారాలను పట్టించుకునే వారు లేకపోవడం, తమ పదవీకాలం ఇంకా రెండేళ్లు ఉండటం వల్ల ప్రభుత్వ సహకారం కోరుతున్న జడ్పీ చైర్‌పర్సన్ టీడీపీలో చేరాలని ఆ పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడు సైతం జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీని పార్టీలో చేర్చుకునేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాను కూటమి క్లీన్ స్వీప్ చేసింది. జిల్లాలో మొత్తం 15 స్థానాలను కూటమి పార్టీలు కొల్లగొట్టాయి. అయినప్పటికీ జిల్లా పరిషత్ కూడా తమ చేతిలో ఉండాలని భావిస్తున్నారు కూటమి నేతలు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు జరగాలంటే స్థానిక సంస్థల్లో బలం ముఖ్యమని భావిస్తున్నారు. ఈ కారణంతోనే ఏలూరు కార్పొరేషన్‌ను టీడీపీ తన ఖాతాలో వేసుకుంది. ఇక జడ్పీని గుప్పిట పెట్టుకోవాలని నిర్ణయించింది. చైర్‌పర్సన్ పద్మశ్రీ టీడీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకోగా, 20 మంది జడ్పీటీసీల్లో కొందరు జనసేన, మరికొందరు టీడీపీ అంటున్నారంటున్నారు. స్థానికంగా వారి రాజకీయ అవసరాలు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 48 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం వైసీపీకి 46 మంది సభ్యుల బలం ఉంది. టీడీపీ, జనసేనకు చెరో సభ్యుడు ఉన్నారు. ఇక జడ్పీ చైర్ పర్సన్‌తోపాటు 20 మంది కూటమిలో చేరితే జడ్పీ కూటమి పరమైనట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా జడ్పీలో ఓటు హక్కు ఉన్నందు వల్ల 20 మంది జడ్పీటీసీలు పార్టీ మారితే? ఎమ్మెల్యేల బలంతో సునాయాశంగా జడ్పీ పీఠాన్ని చేజిక్కుంచుకోవచ్చని లెక్క వేస్తున్నారు. ఐతే జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ చేరికను టీడీపీలోని ఓ ప్రముఖ ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ఎమ్మెల్యే అభ్యంతరం వల్లే చేరిక ఆలస్యమైందని? లేని పక్షంలో ఇప్పటికే జడ్పీలో పసుపు జెండా ఎగిరేదని అంటున్నారు.జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ భర్తకు టీడీపీ ఎమ్మెల్యేకు మధ్య ఎన్నికల సమయంలో తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే సదరు ఎమ్మెల్యే? జడ్పీ చైర్ పర్సన్ చేరికను వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నారు. ఐతే మంత్రి నిమ్మల రామానాయుడు మాత్రం జడ్పీపై టీడీపీ జెండా ఎగరేయాలనే పట్టుదలతో ఎవరు వచ్చినా కాదనకూడదని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయమై మంత్రి నిమ్మల? సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది.జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు జడ్పీటీసీలు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతున్నా, వైసీపీలో మాత్రం ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా రెండుగా విభజన కావడంతో ఇద్దరు నేతలు రెండు పార్టీల అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఉమ్మడి జిల్లాలో కొన్ని మండలాలు తూర్పు గోదావరి జిల్లాలోకి వెళ్లాయి. దీంతో జడ్పీటీసీలతో మాట్లాడే బాధ్యత ఎవరు తీసుకోవాలనేది వైసీపీ తేల్చుకోలేకపోతోంది. ఏలూరు జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన మాజీ మంత్రి ఆళ్ల రాజీనామాతో కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు ఏలూరు బాధ్యతలు అప్పగించారు.కైకలూరు ప్రస్తుతం ఏలూరు జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ గతంలో కృష్ణా జిల్లాలో ఉండేది. దీంతో దూలం నాగేశ్వరరావుకు ఉమ్మడి జిల్లా వ్యవహారాలపై పట్టు లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో చొరవ తీసుకోవాల్సిన మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, శ్రీరంగనాథ రాజు వంటి వారు మాకెందుకులే అన్నట్లు మౌనాన్ని ఆశ్రయించారు. ఈ కారణంగా తమను పార్టీలో ఎవరూ పట్టించుకోవడం లేదనే అసంతృప్తి క్యాడర్‌లో పెరిగిపోతోంది.

# బోరుమంటున్న బెజవాడ





విజయవాడ, సెప్టెంబర్ 5, అవును విజయవాడకు వచ్చిన కష?టం మామూలుది కాదు. వాణిజ్య రాజధానిగా ఉన్న విజయవాడ గత నాలుగు రోజుల నుంచి వ్యాపారాలన్నీ కోల్పోయాయి. ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. నష్టం అంచనా వేయడానికి కూడా కూడా అవకాశం లేకుండా పోయింది. నాలుగు రోజుల నుంచి పడిన భారీ వర్షాలు... ప్రకాశం బ్యారేజీ నుంచి పదకొండు లక్షల క్యూసెక్కుల నీరు ఒక్కసారిగా విడుదల కావడంతో విజయవాడ సగం మునిగిపోయింది. మునగడం అంటే మామూలుగా కాదు... నీళ్లలోకి నీరు చేరింది. మొదటి అంతస్తులోకి కూడా నీరు వచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పకనే తెలుస్తుంది. విజయవాడ అంటేనే ముందుగానే గుర్తుకు వచ్చేది లారీలు. లారీలు, బస్సులు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ బిజినెస్ పూర్తిగా పడిపోయింది. లారీలు సరుకులను తీసుకుని ఇతర రాష్ట్రాలకు వెళ్లి వస్తుంటాయి. కొన్ని వేల సంఖ్యలో లారీలు నాలుగు రోజులు స్టాండ్ లలోనే ఉన్నాయి. దీంతో తమకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లిందని లారీ యజమానుల సంఘం చెబుతుంది. ఒక్క లారీ కూడా కదలలేని పరిస్థితి. రహదారులన్నీ జలమయం కావడంతో పాటు జాతీయ రహదారులపైకి కూడా నీరు చేరడం, అనేక చోట్ల గండ్లు పడటంతో లారీలన్నీ నిలిచిపోయి తమకు లక్షల రూపాయల్లో నష్టం తెచ్చిపెట్టిందని, దీనిని పూడ్చేదెవరని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక ప్రయివేటు బస్సులు కూడా అంతే. ప్రయివేటు బస్సు సంస్థలు విజయవాడ కేంద్రంగా ఎక్కువగా తిరుగుతున్నాయి. ట్రావెల్స్ సంస్థలు అన్నీ నాలుగు రోజులు మూతపడ్డాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులు పూర్తిగా నిలిచిపోవడంతో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. ఇక కాళేశ్వరరావు మార్కెట్ కోస్తాంధ్రలోనే అతి పెద్ద మార్కెట్. హోల్ సేల్ వ్యాపారాలున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు వచ్చి ఇక్కడ కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. కానీ ఆ మార్కెట్ పూర్తిగా నాలుగు రోజుల నుంచి మూతపడి పోయింది. వ్యాపార సంస్థలు గేట్లుకూడా తెరవడం లేదు. ఈ నష్టం కోట్లలో ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. విజయవాడ ఫుడ్ బిజినెస్ కు ఫేమస్. పర్యాటకులతో పాటు ప్రతి రోజూ విజయవాడకు వచ్చే వారితో హోటళ్లన్నీ కళకళలాడుతుంటాయి. కానీ భారీ వర్షాలు, వరదలతో ఈ బిజినెస్ కూడా పూర్తిగా దెబ్బతినింది. దాదాపు ప్రతి హోటల్ లో ఇదే పరిస్థితి. కనీసం పట్టుమని పది మంది కూడా హోటల్ కు వచ్చి భోజనం చేయలేదని వారు చెబుతున్నారు. ఇక లాడ్జీలు మాత్రం కొంత నిండిపోయాయి. విల్లాల్లోకి, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు రావడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం, మంచి నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో విజయవాడకు చెందిన సంపన్నులు మాత్రం లాడ్జిలకు వచ్చి తలదాచుకున్నారు. నేడు నీరు తగ్గడంతో వారి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మొత్తం మీద బెజవాడలో వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఎన్నడూ చూడని బాధలను గత నాలుగు రోజుల నుంచి విజయవాడ ప్రజలు చూశారు. ఒకరకంగా నరకాన్ని అనుభవించారు. తినడానికి తిండి లేదు. తాగడానికి నీరు లేదు. అంత వరదలోనూ వర్షం కురవాలని కోరుకున్నవారు అధికంగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే వర్షపు నీటితోనైనా తమ గొంతులను తడుపుకుందామన్న భావన వారిలో కలిగింది. బాధితులు ఇప్పుడు బయటకు వచ్చి తాము పడ్డ బాధలు చెబుతుంటే కన్నీరు ఆగడం లేదు. అందుకే బెజవాడను వదలి వెళ్లిపోతున్నామని చెబుతున్నారు. మరోవైపు చిన్న పిల్లలు పాల కోసం ఏడుస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు.మానవ తప్పిదమే కాదు. ఎందుకంటే విజయవాడలో ఇంత స్థాయిలో ఎప్పుడూ భారీ వర్షాలు పడలేదు. అయితే ప్రభుత్వం కూడా సరైన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయకపోవడం కూడా ఒక తప్పుగానే చూడాలి. మరో వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి కింది స్థాయి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకూ కష్టపడ్డారు. వారిని ఓదార్చేందుకు ప్రయత్నించారు. భరోసా కల్పించడంలో సక్సెస్ అయ్యారు. అయితే కొన్ని ప్రాంతాలకు ఆహార పదార్థాలను, మంచినీటిని, పాలను అందించలేకపోయారు. ఇందుకు అధికారుల తప్పిదమో, ప్రభుత్వ వైఫల్యమో అని చెప్పలేం.ఎందుకంటే అధికారంలో ఎవరున్నా ఇదే పరిస్థితి ఉంటుంది. అలాగే అధికారుల్లో కూడా అంతే. ప్రభుత్వాలతో పనిలేదు. వారి విధి నిర్వహణలో భాగంగా తమకు అప్పగించిన డ్యూటీని చేస్తారు. కానిస్టేబుల్ నుంచి రెవెన్యూ ఉద్యోగి వరకూ ఎవరైనా బాధితులకు సాయం చేయాలనే ఉంటుంది. కానీ సహకరించని పరిస్థితులు ఉంటాయి. బుడమేరు పొంగి కొన్ని ప్రాంతాలకు బోట్లు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు ఎనిమిది అడుగుల నీరు రావడంతో శివారు ప్రాంతాలకు ఆహార పదార్థాలను చేరవేయలేకపోయారు. అందుకు కారణం మొదటి రోజు బోట్లు అందుబాటులో లేకపోవడం. రెండో రోజు మర బోట్లు వచ్చినా అవి అన్ని ప్రాంతాలకు చేరుకోలేకపోవడంతో ఫుడ్ మెటీరియల్ ను చేర్చలేకపోయామని చెబుతున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. బాధితుల సంఖ్య. ఇది మూడున్నర లక్షల మంది. మూడున్నర లక్షల మందికి ప్రతి రోజూ ఆహార పదార్థాలను, తాగేందుకు నీటిని అందించాలంటే మానవ సాధ్యం కాదు. అందరినీ ఒక చోట చేర్చగలిగితే వారికి భోజనం అందించవచ్చు. కానీ వారి ఇళ్లకు వెళ్లి అందించాలంటే అది ఎవరివల్లా కాదని ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతుంది. ఇప్పుడు బెజవాడ తేరుకుంటుంది. మరోసారి భారీవర్షాలు పడతాయని హెచ్చరించడంతో ఇళ్లను వదిలేసి గుంటూరు పరిసర గ్రామాలకు వెళ్లి తలదాచుకుందామని లక్షల మంది బెజవాడను ఖాళీ చేసి వెళుతున్న దృశ్యాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. భారీ వరదలు కన్నీటిని కుటుంబాలకు మిగిల్చింది. నష్టం ఎంత జరిగిందన్నది మాత్రం అంచనాకు కూడా అందడం లేదు.

# వరదల్లో కనిపించని కమలం నేతలు

విజయవాడ, సెప్టెంబర్ 5, ఏపీలో వైసీపీ నేతలు కనిపించడం లేదు. రాష్ట్రంలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. కానీ ఒక్క బీజేపీ నేత కూడా అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల్లో బిజెపి ప్రాతినిధ్యం పెరిగింది. 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు గెలిచారు. ఒకరికి కేంద్రమంత్రి పదవి లభించింది. మరొకరికి రాష్ట్ర క్యాబినెట్లో చోటు దక్కింది. అయితే వారంతా తమ పదవులను హోదా గానే చూస్తున్నారు. బిజెపి తరఫున సేవలందించడం లేదు. ముఖ్యంగా వరద బాధిత ప్రాంతాల్లో టిడిపి తో పాటు జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. కానీ బిజెపి నుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా కనిపించడం లేదు. బీజేపీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి బాధితుల పరామర్శకు వచ్చారు. కానీ ఒకటి రెండు రోజులకే పరిమితమయ్యారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ జాడలేదు. రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ అమెరికాలో ఉన్నారు. దీంతో బిజెపిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు పరిస్థితి ఉంది. కీలకమైన సమయాల్లో వారు ముఖం చాటేయడంతో ఒక రకమైన విమర్శ వ్యక్తమవుతోంది. బిజెపి నేతల తీరు ఇబ్బందికరంగా మారింది.విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి కూడా కనిపించడం తక్కువగా మారింది. ఒకే ఒక్క రోజు ఆయన బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. తరువాత ఆయన కనిపించకుండా మానేశారు. ఢిల్లీ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. విజయవాడ ప్రజలు కష్టాల్లో ఉంటే.. ఆ ప్రాంత ప్రతినిధిగా ఉన్న సుజనా చౌదరి వ్యవహరించిన తీరు మాత్రం విమర్శల పాలవుతోంది. నియోజకవర్గ ప్రజలు కష్టాల్లో ఉంటే పట్టించుకోకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సుజనా చౌదరి గెలుపుతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ రూపురేఖలు మారుతాయి అని భావించారు. కానీ ఇంతటి విపత్తులో కనీసం పట్టించుకోకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.వాస్తవానికి సుజనా చౌదరి రాష్ట్ర క్యాబినెట్లో చోటు ఆశించారు. మంత్రి పదవి దక్కుతుందని భావించారు. అందుకే ఎంపీగా పోటీ చేయకుండా.. ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అయితే అనేక సమీకరణలను పరిగణలోకి తీసుకొని బిజెపి నుంచి సత్య కుమార్ యాదవ్ కు క్యాబినెట్లో తీసుకున్నారు. అప్పటినుంచి నైరాశ్యంలోకి వెళ్లిపోయారు సుజనా చౌదరి. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవిని ఆశించారు. కానీ చంద్రబాబు పెద్దగా ఆసక్తి చూపు లేదట. అప్పటినుంచి ఢిల్లీకే పరిమితం అయ్యారు సుజనా చౌదరి సుజనా చౌదరి.పొత్తులో భాగంగా బిజెపికి ఛాన్స్ దక్కింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సింది పోయి.. బిజెపి నిర్లక్ష్యం చేస్తుండడం విమర్శలకు కారణమవుతోంది. శాసనసభలో బిజెపి ప్రాతినిధ్యం పెరిగింది. అటు ఎంపీలు ముగ్గురు గెలిచారు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లో చోటు దక్కింది. ఇటువంటి సమయంలో యాక్టివ్ గా ఉండి బిజెపిని అభివృద్ధి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి విపత్తు సమయంలో బిజెపి నేతలు యాక్టివ్ గా పనిచేసి.. కేంద్ర నిధులను సైతం రప్పిస్తే ప్రజలు గుర్తించే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ బిజెపి నేతలు అవేవీ పట్టించుకోకుండా ఎవరికి వారే అన్నట్టు ఉన్నారు.

# నందిగం అరెస్ట్

గుంటూరు, సెప్టెంబర్ 5 బాపట్ల మాజీ ఎంపీ వైఎస్సార్సీపీ నేత నందిగం సురేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఓ రహస్య ప్రాంతంలో ఉన్న ఆయన్ని విజయవాడ పోలీసులు అరెస్టు చేసి తరలిస్తున్నారు.అమరావతిలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనతోపాటు మరికొందరు వైసీపీ నేతలపై కేసులు నమోదు అయ్యాయి. లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురామ్, నందిగం సురేష్ ఈ కేసులో నిందితులుగా పోలీసులు చేర్చారు. ఇప్పిటకే కొందరు అరెస్టు అయ్యి బెయిల్‌పై విడుదలయ్యారు. ఇప్పుడు కీలక నేతలపై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఆ రోజు నేతలు చేసిన ఫోన్ కాల్స్ ఆధారంగా ఈ కేసు విచారణ చేస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురామ్, నందిగం సురేష్ ముందస్తు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. వివిధ కోర్టుల్లో ప్రయత్నాలు చేశారు. చివరకు హైకోర్టులో వారికి ఊరట లభించలేదు. అంతేకాకుండా సుప్రీంకోర్టుకు వెళ్లే వరకు వెసులుబాటు కల్పించాలని ఎలాంటి అరెస్టులు లేకుండా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును అభ్యర్థించినా ప్రయోజనం లేకపోయింది. దీనికి కూడా కోర్టు అంగీకరించలేదు. దీంతో ఒకట్రెండు రోజుల్లోనే నిందితులను అరెస్టు చేస్తారని అంతా భావించారు. కానీ కోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చిన వెంటనే లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్, తలశిల రఘురామ్, నందిగం సురేష్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని పోలీసులు సమాచారం ఇచ్చారు.

# వరద రాజకీయం

## సోషల్ మీడియాలో చంద్రబాబు వర్సెస్ జగన్

విజయవాడ, సెప్టెంబర్ 5, (న్యూస్ పల్స్)వైఎస్ఆర్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రెండు రోజుల పాటు విజయవాడలో పర్యటించారు. రెండు సార్లు ప్రభుత్వ వైఫల్యమేనని తీర్మానించారు. బుధవారం విజయవాడ పర్యటనలో ఆయన చంద్రబాబు సీఎంగా ఫెయిలయ్యారని వరదల్ని సరిగ్గా డీల్ చేయలేదని స్పష్టం చేశారు. అదే తాము అధికారంలో ఉంటే ముందుగా వరదలు ఎప్పుడు వస్తాయో తెలుసుకుని వాలంటీర్ల సాయంతో ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించే వారమన్నారు. ప్రజలకు జరుగుతున్న కష్టనష్టాలకు చంద్రబాబే కారణమన్నారు. చంద్రబాబు ఇల్లు మునిగిపో?యందనే.. కలెక్టరేట్ లో పడుకుంటున్నారని ఆరోపించారు. ఇంకా చాలా అన్నారు. అయితే జగన్ గతంలో సీఎంగా చేసి ఉండకపోతే ఈ విమర్శలకు మంచి వాల్యూ ఉండేదేమో కానీ ఇప్పుడు ఆయన ఐదేళ్లు సీఎంగా చేశారు.. ఆ కాలంలో ఎన్నో విపత్తులు వచ్చాయి. ఆయన పనితీరు కూడా ప్రజల ముందు ఉంది. అందుకే టీడీపీ నేతలు అనేక రకాల ప్రశ్నలు సంధిస్తున్నారు. వైఎస్ జగన్ హయాంలో అత్యంత ఘోరమైన విపత్తు అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడం. డ్యాములు కొట్టుకుపోవడం అంటే చిన్న విషయం కాదు. దీని వెనుక మానవ తప్పిదం ఉందని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ లో ప్రకటించారు. అనూహ్యమైన వరద వస్తుందని పక్కా సమాచారం ఉంది. అదే సమయంలో డ్యామ్ గేట్లు ఎత్తలేదు. ఇసుక లారీల కోసం డ్యామ్ గేట్లు ఎత్తలేదన్న ఆరోపణలు కూడా వచ్చాయి. కారణం ఏదైనా డ్యాం కొట్టుకుపోయింది. పట్టించుకోలేదు. గ్రామాలకు గ్రామాలు కొట్టుకుపోయిన తర్వాత కూడా జగన్ పెద్దగా స్పందించలేదు. వారం రోజుల తర్వాత ముంపు ప్రాంతాల పరిశీలనకు వెళ్లారు. అంతా తాను చూసుకుంటానని చెప్పారు. కానీ ఇప్పటికీ అక్కడి ప్రజలు గుడారాల్లోనే బతుకుతున్నారు. ఇక జగన్ హయాంలో అత్యంత భారీ విపత్తు కరోనా. ఈ సమయంలో ముఖ్యమంత్రి అసలు బయటకే రాలేదు. ఆయన పూర్తిగా తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకే పరిమితమయ్యారు. పైగా అది పెద్ద వైరస్ కాదని.. స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రయత్నించారు. అసలు కరోనాను సీరియస్ గా తీసుకోలేదు కానీ..ఆయన మాత్రం బయటకే రాలేదు. క్వారంటైన్ సెంటర్లను సందర్శించి ధైర్యం చెప్పలేదు. మమతా బెనర్జీ, స్టాలిన్ వంటి పెద్ద వయసు సీఎంలు క్వారంటైనా సెంటర్లను కరోనా ఆస్పత్రులను సందర్శించారు.కానీ జగన్ మాత్రం ఎప్పుడూ బ యటకు రాలేదు. అయితే జగన్ మాత్రం తమ ప్రభుత్వం అద్భుతంగా పని చేసిందని కితాబిచ్చుకుంటున్నారు. ఎవరికీ ఎలాంటి సమస్యలు రాలేదని చెబుతున్నారు. నిజానికి విపత్తులు వస్తే పట్టించుకోకుండా ఎవరి ఖర్మకు వారిని వదిలేయడమే జగన్ చేసిన పని అని.. గొప్ప అన్నట్లుగా స్వయం కితాబులు ఇచ్చుకుంటున్నారని టీడీపీ నేతలు మండి పడుతున్నారు. ఫలానా విపత్తు వచ్చినప్పుడు సక్రమంగా పని చేసిందన్న అభిప్రాయం ఏ విషయంలోనూ జగన్ ప్రభుత్వంపై రాలేదని టీడీపీ నేతల వాదన. చంద్రబాబునాయుడు విపత్తులు వస్తే ఫీల్డ్ లోనే ఉంటారు. ఆయన ఫీల్డులో ఉంటే అధికారులు బాధ్యతతో పని చేస్తారు. ప్రతి విషయాన్ని మానిటర్ చేస్తారు. అయితే ఇదంతా చేతకానితనమని జగన్ అంటున్నారు. చంద్రబాబుకు చేతకాలేదు కాబట్టి రాజీనామా చేయాలని అంటున్నారు.

# సమాజంలో గురువు స్థానం మహోన్నతం

## సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులు నవీకరణ చేసుకోవాలి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విభారే న్యూస్.కర్నూలుప్రతినిధి, సెప్టెంబర్ 05:– సమాజంలో గురువు స్థానం మహోన్నతమని, సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని విద్యార్థులు, గురువులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో గురుపూజోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయుల దినోత్సవం గా జరుపుకుంటామన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించుకోవడం ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని గౌరవించుకోవడం గా భావించి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. దేశంలో ఒకరి పుట్టిన రోజును ఒక దినోత్సవంగా జరుపుకుంటున్నారంటే వారు దేశానికి ఎంతో సేవ చేయడం, జీవితంలో ఎంతో సాధిస్తే తప్ప జరగదని కలెక్టర్ పేర్కొన్నారు.. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి ఉపాధ్యాయుడిగా, ప్రొఫెసర్ గా, ఫిలాసఫర్ లాంటి స్థానాలతో పాటు దేశంలోనే ఉన్నతమైన స్థానాలు లాంటి ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి స్థానాలను సాధించారన్నారు. అలాగే దేశంలోనే అత్యున్నత పురస్కారమైన భారతరత్నను కూడా తీసుకోవడం జరిగిందన్నారు. పిల్లలకు, గురువులకు, దేశంలో ఉండే ప్రతి ఒక్కరికి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఒక స్ఫూర్తి గా నిలిచిరన్నారు. “మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ”అని, తల్లితండ్రుల తర్వాత ఉపాధ్యాయునికి మన సాంప్రదాయాల ప్రకారం అంతటి గౌరవ స్థానాన్ని ఇచ్చామన్నారు. ప్రతి విద్యార్థి ఒక రోజులో 8 గంటల సమయం పాఠశాలలోనే గడుపుతాడని, తన లైఫ్ సైకిల్ ప్రకారం ఒక విద్యార్థి 23 సంవత్సరాల వరకు చదువుకుంటే 1/3 భాగం జీవితం ఉపాధ్యాయులతో పాఠశాలలో గడుపుతారని, అదే విధంగా ఉపాధ్యాయులు కూడా తన సొంత పిల్లలతో సమయం గడపడం కంటే విద్యార్థులతోనే వారి జీవితంలో 1/3 భాగం సమయం గడుపుతారన్నారు. విద్యార్థులు వారి జీవితంలో 1/3 భాగం పాఠశాలలో, కళాశాలలో గడిపే సమయం చాలా ముఖ్యమైనదని, ఎందుకంటే ఆ సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు నేర్పించే పాఠాలు, క్రమశిక్షణ, గైడెన్స్ కావచ్చు, వారి మెదడు లో నింపే ఆలోచనలు జీవితాంతం ఉంటాయన్నారు. జనగణమన గీతం రాగానే ఎవరు చెప్పకుండానే మనమందరం లేచి నిల్చుంటాం, అదే విధంగా ఉన్నత అధికారులు, ఉపాధ్యాయులు రాగానే గౌరవంతో మనం లేచి నిల్చుంటాం ఎందుకంటే ఈ క్రమశిక్షణ అనేది మనకు పాఠశాలలో ఉపాధ్యాయులు నేర్పించినదే అని కలెక్టర్ పేర్కొన్నారు. అందుకే మనం జీవితంలో తల్లిదండ్రులకు గౌరవం ఇచ్చిన తర్వాత మరిఅంతటిగౌరవ ఉపాధ్యాయులకే ఇస్తామన్నారు.. విద్యార్థులకు పాఠాలలో ఉన్న సందేహాలను వారికి అర్థమయ్యే విధంగా చెప్పడంతో పాటు విద్యార్థులలో ఉండే ప్రతిభను బయటకు తీసి,మార్గదర్శనం ఇచ్చినట్లయితే వారు ఉన్నత స్థానంలో ఉంటారని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. తమ సొంత కూతురు, కొడుకు ఏ విధంగా ఐతే ఉన్నత స్థానంలో ఉంటే తల్లితండ్రులు ఆనందిస్తారో!! అదే విధంగా వారి విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉంటే ఉపాధ్యాయులు కూడా అదే విధంగా సంతోషిస్తారన్నారు. విద్య యొక్క నాలుగు ప్రధాన లక్ష్యాలైనటువంటి జ్ఞానం, అండర్స్టాండింగ్, నైపుణ్యత లను ఉపాధ్యాయులు సాధించగలగాలని, ఉపాధ్యాయులందరూ టెక్నాలజీని ఎప్పటికప్పుడు నవీకరణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.. విద్యలో, ఎడ్యుకేషన్ పాలసీలో వస్తున్న మార్పులను ఎప్పటికపుడు తెలుసుకోవాలన్నారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠాలను ఏ విధంగా చెప్పొచ్చు, విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో ఏ విధంగా చెప్పొచ్చు, ఇంకా ఎంత అడ్వాన్స్ గా పాఠాలను చెప్పేందుకు ప్లాన్ చేసుకోవచ్చు అనే విషయాలను ప్రతి ఒక ఉపాధ్యాయుడు ఆలోచించుకోవలసిన అవసరం ఉందన్నారు. టెక్నాలజీలో ఉపాధ్యాయులందరూ అప్డేట్ అవడంతో పాటు విద్యార్థులను కూడా అప్డేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలకు అడ్వాన్స్ డ్ గా యూట్యూబ్ లో చూసి వారికి వచ్చిన సందేహాలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొని వచ్చిన సమయంలో, ఉపాధ్యాయులు వాటికి నివృత్తి చేయాలంటే ఉపాధ్యాయులందరూ నిరంతరం విద్యార్థిగా పాఠాలను రివైజ్ చేసుకుంటూ ఉండడంతో పాటు టెక్నాలజీ లో కూడా అప్డేట్ గా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్ట్ లను మెగా డి ఎస్ సి ద్వారా భర్తీ చేయనుందన్నారు. టీచర్లు లేని ప్రాంతాల్లో వర్చువల్ గా పాఠాలు చెప్పే విధంగా డీఈవో కార్యాలయంలో గాని లేదా ఇతర ప్రదేశంలో గాని వర్చ్యువల్ ల్యాబ్ మెకానిజంను ఏర్పాటు చేయాలని, అదే విధంగా వాటిని రికార్డు చేసి టీచర్లు లేని ప్రాంతంలో విద్యార్థులకు వీడియో రూపంలో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఈఓ ను కలెక్టర్ ఆదేశించారు.కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ తల్లి ప్రాణం పోస్తే, తండ్రి ఏ విధంగా భద్రతను కల్పిస్తారో అదే విధంగా గురువు కూడా విద్యార్థులకు జీవితంలో ఏ విధంగా రాణించాలో అనేది నేర్పించడం జరుగుతుందన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఉపాధ్యాయ వృత్తి నుండి దేశంలోనే ఉన్నత పదవి అయిన రాష్ట్రపతి పదవిలో దేశానికి పలు సేవలు అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు కూడా వారి బాటలో నడిచి దేశానికి ఉపయోగపడాలన్నారు. కర్నూలు పార్లమెంటు స్థానానికి పోటీ చేయక ముందు ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించానని, ఈ స్థానానికి రావడానికి మా ఉపాధ్యాయులు ప్రోత్సహం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల యొక్క పాత్ర చాలా విలువైనదని, విద్యార్థులు వ్యక్తిత్వంతో పాటు విద్యలో కూడా ఉన్నతంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి ఎటువంటి ప్రోత్సాహకలైనా, వారికి ఏ విధమైన సమస్యలు ఉన్న అందుకు తగిన కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 1962వ సంవత్సరం సెప్టెంబరు 5వ తేదిన నుండి గౌరవ డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పట్టుదలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రపంచ విద్యావేత్తలలోనే డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని గుర్తించడం జరిగిందన్నారు. ఒకానొక సమయంలో జాతిపిత మహాత్మాగాంధీ గారు ఒక సందర్భంలో నేను అర్జునుడునైతే సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు శ్రీకృష్ణుడు లాంటి వారని నేను వారిని నా గురువుగా భావిస్తున్నానని మహాత్మ గాంధీ గారు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని ప్రశంసించడం జరిగిందన్నారు. దేశంలోని వివిధ రకాల హోదాల్లో పనిచేయడంతో పాటు రెండు దఫాలుగా భారతదేశానికి ఉప రాష్ట్రపతిగా, ఒకసారి రాష్ట్రపతిగా, రష్యాలో భారత రాయబారిగా దేశానికి సేవలు అందజేయడం జరిగిందన్నారు. దేశంలో అక్షరాస్యతను పెంచడానికి ప్రభుత్వం వివిధ రకాల సౌకర్యాలతో పాటు యూనిఫాం, బ్యాగ్స్, షూస్ తదితర వాటిని అందజేయడం జరిగిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను పూర్తి స్థాయిలో చర్చించి వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆలూరు నియోజకవర్గం హోలగుంద మండలం మార్లముడికి అనే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సుమారుగా 120 మంది విద్యార్థులు విద్యను అభ్యసించడం జరుగుతుందని అయితే గత ఏడాది నాడు-నేడు క్రింద ఉన్న భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మించేందుకు పాత భవనాలను తొలగించడం జరిగిందని, ప్రస్తుతం పాఠశాలను బాడుగ భవనాల్లో నిర్వహించడం జరుగుతుందని, కావున పాఠశాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. పాణ్యం ఎంఎల్ఏ గౌరు చరిత మాట్లాడుతూ “మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ” అనే వాఖ్యాలను మన పెద్దవారు చెప్పడం జరిగిందని, గురువులకు తల్లితండ్రుల తర్వాత అంతటి స్థానం కల్పించడం జరిగిందన్నారు. “గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వరః గురుసాక్షాత్ పరబ్రహ్మః గురువే నమః” గురువు, దేవుడు ఇద్దరు ప్రత్యక్షమైతే నేను గురువుకే నమస్కరిస్తాను ఎందుకంటే దేవుడు కనిపించడు, కనిపించే ప్రత్యక్ష దైవమే గురువు అని అప్పట్లో భక్త రామదాసు గారు చెప్పారన్నారు. తల్లి జన్మనిస్తే, నేను ఎలా బతకాలో నా జీవనం ఎలా కొనసాగించాలో అనే విషయాలను తెలియచేసినవాళ్లు గురువులని విశ్వ విజేత అలెగ్జాండర్ గారు తెలిపారన్నారు. గురువులకు ప్రతి ఒక్కరు అంతటి మహోన్నత స్థానం కల్పించడం జరిగిందన్నారు. గురువులు రూపం లేని రాళ్లను శిల్పాలుగా తీర్చిదిద్దుతున్నారని, అందులో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక ఉన్నత స్థానంలో ఉన్నారంటే దానికి కారణం గురువులని, గురువు రుణం తీర్చుకోలేనిదన్నారు. అంతే కాకుండా విద్యార్థి దశ నుండి విద్యార్థులను మంచి నడవడికలో, మంచి విలువలతో, మంచి క్రమశిక్షణలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ తన పుట్టినరోజుకి బదులుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించాలని చెప్పిన మహోన్నత వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారన్నారు. విద్యార్థులందరూ జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్యాన్ని సాధించుటకు అహర్నిశలు కృషి కృషిచాలని విద్యార్థులకు సూచించారు.తొలుత గురుపూజోత్సవం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడంతో పాటు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి చిత్రపటానికి కలెక్టర్, ఎంఎల్ సి, కర్నూలు ఎంపీ, పాణ్యం శాసన సభ్యులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందజేసిన 23 మంది ఉపాధ్యాయులకు కలెక్టర్, ఎంఎల్ సి, కర్నూలు ఎంపీ, పాణ్యం శాసన సభ్యులు శాలువ, సర్టిఫికేట్ తో సన్మానం చేశారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, జెడ్పీటీసీ యస్.ప్రసన్న కుమార్, 17వ వార్డు కార్పొరేటర్ కె.పద్మలత, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








## ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పది




విభారే న్యూస్ డోన్ మా ప్రతి నిది :–ఆగస్టు 5 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించి నట్లు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు.. 9,10 తరగతుల విద్యార్థులు ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను వేదిక మీదకు పూలతో స్వాగతం పలికి, అందరికీ మెమొంటోలు అందించారు. పట్టణ సిఐ ఇంతియాజ్, ఫోటోగ్రఫీ మరియు వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నాగభూషణ రెడ్డి , అధ్యక్షుడు రాజు, కార్యదర్శి శ్రీనివాసులు పాఠశాల ఉపాధ్యాయులు అల్లిపీరా, సురేష్ లను శాలువా కప్పి, పూలమాల, మెమొంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ తమిళనాడు లోని తిరుత్తణిలో 1988లో సెప్టెంబర్ 5న జన్మించారు. కేంద్ర ప్రభుత్వం 1962 నుండి ఈరోజు ను ఉపాధ్యాయ దినోత్సవం గా పరిగణించి గౌరవిస్తుంది. గురువులకే గురువు మన సర్వేపల్లి. అందుకే ఆయన పుట్టిన రోజును పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా త్వరగా పదవీవిరమణ చేయబోయే ఉపాధ్యాయులు లక్ష్మయ్య, సంజీవరెడ్డి, లీలావతమ్మ లను సన్మానించారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, వెంకట లక్ష్మి, అల్లిపీరా,రాధ, సుబ్బారాయుడు,రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, జయసుబ్బారాయుడు, మద్దిలేటి, రమేష్, సుభాన్, విజయకుమార్, శివన్న, రమేష్, మధుసూదన్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, ఆదినారాయణ, దేవేంద్రప్ప, భారతి, లక్ష్మి ప్రభావతి, శ్రీనివాసులు, భాను ప్రకాష్ రెడ్డి, హుస్సేన్ భాను, ప్రసాద్ రావు, ముని రాజు, మహేష్, అల్లిపీరా, ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు

# జిల్లా విద్యారంగ అభివృద్ధి కై జరుగుతున్న ప్లినరికి తరలిన ఎస్ ఎఫ్ ఐ నాయకులు...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి సెప్టెంబర్ 5 నంద్యాల జిల్లా విద్యారంగ అభివృద్ధి కై నంద్యాలలో జరుగుతున్న 3వ ప్లినరి సమావేశంలో డోన్ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు ఎదుకొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ ప్లినరీ సమావేశాలు ఒక వేదిక కాబోతున్నాయని ఎస్ ఎఫ్ ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు విజయ్ నాయక్, జె. అశోక్ అన్నారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర బడ్జెట్లో విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించే విధంగా బడ్జెట్ కేటాయించాలని వారన్నారు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్క విద్యార్థికి అమ్మ వందనం కింద తక్షణమే 15వేల రూపాయలను ఇవ్వాలని వారు అన్నారు.డోన్ ప్రాంతంలోని విద్యార్థులు ఉన్నత విద్య చదివేందుకు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని అలా కాకుండా డోన్ లో ప్రభుత్వ మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో మంజూరైన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకై భూమి సేకరించిన ప్రాంతంలో తక్షణమే కేంద్రీయ విశ్వవిద్యాలయం శాశ్వత




భవనాలు నిర్మాణాన్ని ప్రారంభించి ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించే విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మైనింగ్ జాతీయ కళాశాల ఏర్పాటు చేయాలని,నర్సింగ్ కళాశాల నెలకొల్పాలని వారన్నారు.ఈ ప్రాంతంలోని విద్యార్థులకు భావితరాల విద్యార్థులకు, యువకులకు అభివృద్ధి బాటలో నడిచే విధంగా ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు రాజకీయ వైద్యాలను విడనాడి ఈ ప్రాంత అభివృద్ధికై ముందుకు సాగాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా అక్బర్ బాషా,మాబు, శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా గణేష్ రంగా నాయక్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190